క్లుప్తంగా

శివాలయంలో పూజారికి దీపదానం



పూజారికి దీపదానం చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకాన్ని భక్తులు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేయించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు పూజారికి దీపదానం చేశారు. ఈ మేరకు హాజరైన భక్తులందరికీ ఆశీర్వచనం ఇచ్చిన అనంతరం పూజారి రమేశ్ తీర్థ ప్రసాదాలు అందించారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టిసారించాలి

కాల్వశ్రీరాంపూర్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎన్నికలు సజావుగా జరిగేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులు శ్రీధర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, గంగారం గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించే జెడ్పీ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా ఓటర్లకు ప్రత్యేక క్యూలైన్లు, ఓటర్లకు తాగునీరు, టాయిలెట్ల ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్ చుట్టుపక్కలా నిర్ణీత దూరం పాటించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వాటి జాబితా తయారు చేసి ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్ పాషా, సుల్తానాబాద్ సీఐ జగదీశ్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగం, ఉదయశ్రీ పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు శ్రీధర్

ఓదెలలో పోలింగ్ కేంద్రాల సందర్శన

ఓదెల: మండల కేంద్రంలోని హైస్కూల్‌లోని పోలింగు కేంద్రాన్ని అబ్జర్వర్ శ్రీధర్ శనివారం సందర్శించారు. ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్, తహసీల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు నవచైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ బాధిత కుటుంబానికి శనివారం బియ్యం, నిత్యావసరాలు, నగదు అందించింది.



ఓటుహక్కుపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం పట్టణ సమాఖ్య, ధనశ్రీ పట్టణ సమాఖ్య మహిళలకు ఓటుహక్కు వినియోగంపై మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవడంతో పాటు మహిళలను ఓటువేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. మెప్మా పీడీ రజినీ, టీఎంసీ శ్వేత, మెప్మా సీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల నిర్వహణకు దాతలు సహకరించాలి



హోమం నిర్వహిస్తున్న సభ్యులు

సుల్తానాబాద్: పట్టణంలోని యాదవనగర్‌లో ఉన్న గోశాలలోని గోమాతల నిర్వహణ, గ్రాసం కోసం దాతలు తమ వంతు సహకారాలు అందించాలని, గోమాతను రక్షించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని గోశాల ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శ్రీధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ ఆలయం వద్ద గల శ్రీధర్మశాస్త్ర గోశాలలో వేద పండితుడు ఉప్పర మల్యాల లక్ష్మణ్‌శర్మ ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శనివారం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, నవగ్రహ సర్వతోభద్ర మంటపారాధన తదితర పూజలు చేశారు. వేద పండితుడు ఉప్పర మల్యాల లక్ష్మణ్ శర్మ, పండితులు సుబ్రహ్మణ్యశర్మ, ఆంజనేయ శర్మ, ముక్తేశ్వరశర్మ, గోశాల ఫౌండేషన్, గోశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం కాంగ్రెస్.. మధ్యాహ్నం బీఆర్‌ఎస్‌లోకి



జూలపల్లి: కాంగ్రెస్‌లో చేరుతున్న లక్ష్మణ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మణ్ దళితబంధు లబ్ధిదారుడు. ఈ ఎన్నికల్లో పార్టీకి చురుగ్గా పనిచేస్తుండగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులకు లక్ష్మణ్‌కు మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఎవరికీ తెలియకుండా శనివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు స్వగృహంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. కాంగ్రెస్‌లో చేరిన ఫొటోలు వాట్సాప్‌లో వైరల్ అయ్యాయి. అప్రమత్తమైన గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే తనయుడు దాసరి ప్రశాంత్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో మధ్యాహ్నం హుటాహుటిన పెద్దాపూర్‌కు వచ్చి నచ్చజెప్పి బీఆర్‌ఎస్ కండువా కప్పారు. ఎంపీటీసీలు కత్తెర్ల శ్రీనివాస్, తమ్మడవేని మల్లేశం, కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు.



రోడ్డుపక్కనే డంపుయార్డు

కమాన్‌పూర్: మండల కేంద్రం నుంచి గోదావరిఖని వెళ్లే ప్రధాన రహదారి శ్మశాన వాటిక వద్ద గ్రామంలో సేకరించిన చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలు పడేస్తుండంతో డంప్‌యార్డులా మారిపోయింది. దారి వెంట వెళ్లే ప్రజలు దుర్వాసనతో పాటు కుక్కలతో ఇబ్బంది పడుతున్నారు. చెత్త కుప్పలు కాల్చివేయడంతో పొగతో ఇబ్బంది పడుతున్నారు.

ఓసీపీలు ఎందుకు ఆపలేదు?



గోదవరిఖని: జీడీకే-1వ గని వద్ద ప్రసంగిస్తున్న రాజ్‌ఠాకూర్



రామగుండం: మద్దిర్యాలలో మహిళల సమావేశం

- కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఓసీపీలు రాకుండా కుర్చీ వేసుకుని ఇక్కడే కూర్చుంటామన్న సీఎం కేసీఆర్ ఎక్కడున్నారని, జీడీకే-5 ఓసీపీ ప్రారంభమైతే ఏం చేశారని రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల దీవెన యాత్రలో భాగంగా జీడీకే-1వ గనిపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపించాలని కోరారు. జిల్లా కన్వీనర్ పెంచాల తిరుపతి, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు గుమ్మడి కుమారస్వామి, నర్సింహారెడ్డి, కె.స్వామి, ఆరెల్లి పోశం, మాదన మహేశ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్‌ను గెలిపిస్తామని టీడీపీ నాయకులు ప్రకటించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్‌రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. 29, 41, 27, 28 డివిజన్లలో ఆయన పాదయాత్ర చేశారు. పలువురు పార్టీలో చేరారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటా

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టులోని కాంట్రాక్టు కార్మికులకు అన్నగా, అండగాఉంటానని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కార్మికులను కలుసుకుని మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు పాటుపడాలి

రామగుండం: మాజీ జెడ్పీటీసీ హేమలతాఠాకూర్, మాజీ ఎంపీపీ శ్రీరాముల నీరజ అంతర్గాం మండలం మద్దిర్యాల, పొట్యాల, విసంపేటలోని మహిళలతో వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.

ఓటరు జాబితా పరిశీలన

కార్పొరేషన్ 22వ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఓటరు జాబితా ఆధారంగా ఓటర్లను నేరుగా కలుస్తూ మక్కాన్‌సింగ్‌ఠాకూర్ చేయిగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ నస్రీన్‌బేగం కోరారు.

ఆశీర్వదిస్తే.. ధాన్యంలో కోత లేకుండా చూస్తా

- కాంగ్రెస్ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదిస్తే ధాన్యం కొనుగోళ్లలో కోతలు లేకుండా చూస్తానాని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు హామీ ఇచ్చారు. ఐతరాజుపల్లి, భూపతిపూర్, బొంతకుంటపల్లి, నర్సయ్యపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, నీరుకుల్లలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారరం నిర్వహించారు. ఈసందర్భంగా భూపతిపూర్ నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన రైతు సమన్వయ సమితి గ్రామ వైస్ చైర్మన్ పోచంపల్లి రాజయ్య, బీజేపీ అధ్యక్షుడు వేముల స్వామి, లక్ష్మీరాజం, రామచంద్రం కాంగ్రెస్‌లో చేరగా విజయరమణారావు పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ కవ్వంపల్లి జమున, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గ్రామశాఖ అధ్యక్షుడు బక్కయ్య, తిరుపతి, లక్ష్మణ్, సంపత్, రాజు, రవి పాల్గొన్నారు.

మార్కండేయ కాలనీలో ప్రచారం

సుల్తానాబాద్: మార్కండేయకాలనీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు సతీమణి పావని ప్రచారం చేశారు. జెడ్పీటీసీ మినుపాల స్వరూప, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, కౌన్సిలర్‌లు వరప్రదీప్, సునీత, నిషాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



సుల్తానాబాద్: భూపతిపూర్‌లో ప్రచారం చేస్తున్న విజయరమణారావు

జూలపల్లి: పెద్దాపూర్, కోనరావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మణ్, అల్లికొండ అనంతరెడ్డి, దూస మల్లేశం, దాడి కుమార్ మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు, నాయకులు లోక జలపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌దే గెలుపు కావాలి

పెద్దపల్లిరూరల్: 'ఈ ఎన్నికల్లో పెద్దపల్లిపై కాంగ్రెస్ జెండా ఎగరాలి.. మీ విజ్జన్నను ఎమ్మెల్యేగా గెలిపించుకుని రండి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు కొలిపాక శ్రీనివాస్, కొలిపాక సంధ్య, చిరంజీవి, నర్సయ్యతో పాటు పలువురు నాయకులకు పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సుల్తానాబాద్: ప్రచారంలో విజ్జన్న భార్య పావని

బీఆర్‌ఎస్‌తోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు



రాఘవాపూర్‌లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



సుల్తాన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి పుష్పలత

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సర్కార్ ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. రాఘవాపూర్, గుర్రాంపల్లి, మారెడుగొండ, జగన్నాథపురం, రాంపల్లి, హన్మంతునిపేటలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, మర్కు లక్ష్మణ్, తాడిచెట్టి శ్రీకాంత్, శ్రీనివాస్, రామస్వామి, కొముదయ్య, జడల సురేందర్, వొడ్నాల శంకరయ్య, గాండ్ల సదయ్య పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

సుల్తానాబాద్: ప్రభుత్వాన్ని మూడోసారి ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. 2, 5వ వార్డుల్లో దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీ గణపతి ప్లంబర్ యూనియన్ సభ్యులు దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

ఎలిగేడు: సుల్తాన్‌పూర్‌లో దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి దాసరి పుష్పలత ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, జెడ్పీ వైస్ పర్సన్ రేణుక, నాయకుడు మోహన్‌రావు పాల్గొన్నారు

పెద్దపల్లిలో దాసరి హ్యాట్రిక్ ఖాయం

ఓదెల: దాసరి మనోహర్‌రెడ్డి హ్యాట్రిక్ ఖాయమని టీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఓదెలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్‌ను నమ్మొద్దు

సుల్తానాబాద్/జూలపల్లి: కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయి గోసపడొద్దని సివిల్ సప్లయి చైర్మన్ రవీందర్‌సింగ్ అన్నారు. దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా సుల్తానాబాద్, జూలపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దాపూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆదరిస్తే.. సేవకుడిగా పనిచేస్తా

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని/మహాముత్తారం/మల్హర్/కాటారం/కమాన్‌పూర్: తనను ఆదరించి ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మహాముత్తారం మండలం నిమ్మగూడెం, యత్నారం, సింగంపల్లి, రెడ్డిపల్లి, సింగారం, స్తంభంపల్లి పీకే, రేగులగూడెం, జీలపల్లి, మాదారం, వజినెపల్లి, స్తంభంపల్లి(పీపీ), ములుగుపల్లి, ఉట్లపల్లి, పోలారంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు రాము, మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాదారపు స్వామి, ప్రచార కమిటీ చైర్మన్ పక్కల రాజబాపు పాల్గొన్నారు. బహుజనులు పార్టీలకు అతీతంగా పుట్ట మధును గెలిపించాలని బహుజన సేవ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కె.యాదవ్ కోరారు. కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు యామన్‌పల్లికి చెందిన లక్ష్మి, మల్లయ్య దంపతులు ఎన్నికల ఖర్చు కోసం రూ.10,166 విరాళంగా అందజేశారు. అడువాలపల్లి, చింతకానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా, పుట్ట మధు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జూలపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. పిల్లిపల్లె, సిద్దిపల్లెకు చెందిన పలువురు పుట్ట మధు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



మహాముత్తారం: నిమ్మగూడెంలో పుట్టమధుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతం

ఐదేళ్లకోసారి ఓట్లకోసం వచ్చే టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతమని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకు ఓటువేసి ఆశీర్వదించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని ఐదోవార్డు కూచిరాజ్‌పల్లి, శ్రీరాంనగర్‌లో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో గురించి ఆమె వివరించారు.



కమాన్‌పూర్: పార్టీలో చేరిన వారితో పుట్ట మధు

ఆంధ్రా టీడీపీ నాయకులతో విషప్రచారం



గోదావరిఖని: ఆధారాలు చూపిస్తున్న కోరుకంటి చందర్

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్

గోదావరిఖని: ఓటమి భయంతో కాంగ్రెస్ ఆంధ్రా టీడీపీ నాయకులతో కలిసి సోషల్ మీడియా వేదికగా తనపై విషప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ ఆరోపించారు. నగరంలోని స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏపీలోని టీడీపీ యువజన నాయకుడు నాగశ్రావణ్ కిలారు సంస్థ పొలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ ద్వారా జీడీకే డిజార్వ్స్ బెటర్ పేరిట ఫేస్‌బుక్ వాల్‌పై మార్ఫింగ్ చేసిన తన ఫొటోలతో నీచమైన కామెంట్స్, పాటలతో పోస్ట్ చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. వాటిఆధారాలతో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం బీజేపీ నాయకులు రాచకొండ కోటేశ్వర్, నర్సింగ్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఉద్యోగాలు కల్పించింది బీఆర్‌ఎస్సే..

సింగరేణి వారసులకు ఉద్యోగాలు కల్పించింది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అని చందర్ అన్నారు. జీడీకే-2వ గనిపై గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు.

మా నాన్నను గెలిపించండి

యైటింక్లయిన్‌కాలనీ: ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కుమార్తె ఉజ్వల కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రామగుండం: బీఆర్‌ఎస్‌తోనే ముస్లిం కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని మైనార్టీ ప్రతినిధి అహ్మద్‌బాబు అన్నారు. పట్టణంలో బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ ప్రతినిధులు శనివారం విలేకరులతో మాట్లాడారు.

నిరుపయోగంగా టాయిలెట్స్



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామ శివారులోని రాజన్నల వాడలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఆర్ఎంసీ స్వచ్ఛ తెలంగాణలో భాగంగా స్వచ్ఛ రామగుండం కోసం 2021లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించి వదిలేశారు. మరుగుదొడ్లకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. నీటి వసతి లేక, లోపలి ఉన్న కుండీలు పగిలి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల ప్రజలు, రోడ్డుపై ప్రయాణించేవారు అంటున్నారు. రామగుండం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జీవిత బీమాపై కళాజాత ప్రదర్శన



జూలపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో జీవిత బీమా పాలసీలపై ఖాతాదారులకు కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్యాషియర్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకుని కుటుంబానికి రక్షణ కల్పించాలని సూచించారు. రూ.436, రూ.20ల ప్రీమియంతో కేంద్ర ప్రభుత్వం జీవిత బీమా పాలసీలను అమలు చేస్తోందని వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు ఏటీఎం కార్డు వినియోగంపై రూ.2లక్షల బీమా సౌకర్యం కల్పించినట్లు అవగాహన కల్పించారు. మేనేజర్ నర్సింహరావు, సిబ్బంది రాజు, ఖాతాదారులు కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.